ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

చిత్తూరు
జిల్లా వార్తలు
సోమవారం 25 నవంబరు 2024

చెడు అలవాట్లకు పోలీసులు దూరంగా ఉండాలి

అలర్ట్‌గా ఉంటూ, ఆరోగ్యంపైనా దృష్టి పెట్టాలి

● ఫిట్‌నెస్ తప్పనిసరి ● ఏఎస్పీ రాజశేఖర్ రాజు

పోలీసులు ఎప్పుడూ ఆరోగ్య స్పృహతో ఉండాలి. వేరే శాఖ ఉద్యోగులకు చెడు అలవాట్లు ఉంటే.. వారికి మాత్రమే నష్టం కలుగుతుంది. పోలీసులకు ఉంటే.. దాని ప్రభావం ప్రజలపై పడుతుంది. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. అందువల్లే అరవై ఒక్క ఏళ్ల వయసులోనూ చెడు అలవాట్లకు దూరంగా, ఆరోగ్యంగా ఉన్నాను.. అంటున్న రాజశేఖర్ రాజుతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

బయోడేటా

ఎస్.ఆర్.రాజశేఖర్‌రాజు
ఉద్యోగం: చిత్తూరు ఆపరేషన్ ఏఎస్పీ
కుటుంబం: భార్య, ఇద్దరు పిల్లలు
జన్మస్థలం: పుంగనూరు
విద్యాభ్యాసం: బీకాం, ఎల్ఎల్‌బీ



తొలి ప్రయత్నంలోనే ఎస్ఐగా..

1989లో తొలి ప్రయత్నంలోనే ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యారు. కడప జిల్లాలో ఎస్ఐ, సీఐగా 17 ఏళ్లపాటు పనిచేశారు. కడపలో అప్పట్లో ఫ్యాక్షన్ ఎక్కువగా ఉండడంతో.. ఉన్నతాధికారులు ఈయన్ను ట్రబుల్ షూటర్‌గా వాడుకునేవారు. కర్నూలు జిల్లాలో సీఐ, డీఎస్పీగా 12 ఏళ్లు పనిచేశారు. కర్నూలు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఏడేళ్లపాటు వైస్ ప్రిన్సిపాల్ పనిచేశారు. ఆదోని మతకలహాల సమయంలో శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్‌గా ఉంటూ 200 మంది ట్రైనీ పోలీసులతో వెళ్లి కీలకపాత్ర పోషించారు. సమస్యాత్మక మండలాల్లోనే ఈయనకు ఎన్నికల విధులు అప్పగిస్తారు.

డీఎస్పీగా ఒక్క సబ్‌డివిజన్ కూడా చేయని వైనం

సుమారు పదేళ్లకుమించి డీఎస్పీగా పనిచేయగా, కనీసం ఆరు నెలలు కూడా సబ్ డివిజన్‌లో పనిచేయలేదు. సబ్‌డివిజన్‌లో పనిచేయాలంటే కచ్చితంగా రాజకీయ సిఫారసు అవసరం. అలాంటి వాటికి దూరంగా ఉండటంతో ఏ పార్టీ నాయకుడూ ఈయన్ను దగ్గరకు తీయలేదు. సుమారు ఏడేళ్లపాటు కర్నూలు పోలీస్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్‌గా, విజయవాడ కమిషనరేట్‌లో పోలీస్ కంట్రోల్ రూమ్ ఏసీపీగా పనిచేశారు.

చిన్నప్పుడు కూలి పనులు చేశారు

రాజశేఖర్ రాజు పుంగనూరులోని నిరుపేద కుటుంబంలో పుట్టారు. చిన్నప్పుడు కూలి పనులు చేశారు. విద్యార్థి దశ నుంచే కరాటేపై మక్కువ పెరగడంతో బ్లాక్‌బెల్ట్ సాధించారు. కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ రేస్‌లోనూ ప్రావీణ్యం ఉంది.


సీఎం చంద్రబాబు నుంచి అవార్డును స్వీకరిస్తూ..

'జగన్నాథగట్టు'ను అహ్లాదంగా మార్చారు

కర్నూలులోని జగన్నాథగట్టు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో ఈ కేంద్రం అడవిని తలపించేది. బాధ్యతలు స్వీకరించాక ఈ కేంద్రాన్ని ఆహ్లాదంగా మార్చారు. సిబ్బందితో కలిసి దాదాపు ఐదు వేల మొక్కలను నాటి, పెంచారు. ఏడేళ్లలో ఎనిమిది వేల మంది కొత్త, ఇన్‌సర్వీసు పోలీసులు, ఏఎస్ఐ, ఎస్ఐలకు శిక్షణ ఇచ్చారు.

రివార్డుల రారాజు

పనిచేసినచోట ప్రతి ఏడాది రిపబ్లిక్‌డే, స్వాతంత్ర్య దినోత్సవాల్లో అధికారులకు ఇచ్చే ప్రశంసాపత్రాల్లో రాజశేఖర్‌రాజు పేరుంటుంది. 2009లో సేవా మెడల్, ఉత్తమ సేవలకు 2014లో ముఖ్యమంత్రి ప్రశంసాపత్రం, 2016లో పోలీసు ఉత్తమ సేవా మెడల్, గవర్నర్ మెడల్, బెస్ట్ ట్రాక్‌తో విజిలెన్స్ ఆఫీసర్‌గా పలు అవార్డులను అందుకున్నారు. అలాగే క్యాష్ అవార్డులు 3, జీఎస్ఈ అవార్డులు 85, అప్రిసియేషన్ అవార్డులు 159, కమాండిటేషన్ పత్రాలు 82, మెరిట్ సర్టిఫికెట్ ఒక్కటి చొప్పున మొత్తం 334 అవార్డులు, రివార్డులను అందుకున్నారు.

ఏఎస్పీగా రెండో పోస్టింగ్

ఏఎస్పీగా ప్రమోషన్ పొందాక తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి అడ్మిన్ ఏఎస్పీగా తొలి పోస్టింగ్ దక్కింది. రెండు నెలల కిందట అన్నమయ్య జిల్లా ఏఎస్పీగా బదిలీ చేసినా జాయిన్ కాలేదు. ఇటీవల చిత్తూరు ఆపరేషన్ ఏఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. తాజాగా అడ్మిన్ ఏఎస్పీగా కూడా ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్నారు.


అప్పటి మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి నుంచి ఏపీ స్టేట్ పోలీసు మెడల్ తీసుకుంటూ..

ఆరు పదులు దాటినా యువకుడే

61 ఏళ్ల వయసులోనూ రాజశేఖర్ రాజు యువకుడిలా ఫిట్‌నెస్ విషయంలో అశ్రద్ధ చేయరు. కింది స్థాయి అధికారులు, సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉదయం, సాయంత్రం గంట చొప్పున జిమ్‌కు వెళ్లడం 35 ఏళ్లుగా అలవాటు చేసుకున్నారు. ఐదు కిలోమీటర్లు జాగింగ్ చేస్తున్నారు.

కుప్పం రోడ్లకు మహర్దశ


శాంతిపురం మండలం కెనమాకులపల్లె రోడ్డుపై మొదలైన మరమ్మతులు

- రూ.1.28 కోట్లతో మరమ్మతులు
- మరో రూ.68 కోట్లతో ప్రతిపాదనలు
- వాహన చోదకుల కష్టాలకు చెక్

కుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం రోడ్లకు మహర్దశ ప్రారంభమైంది. ప్రస్తుతానికి రహదారులు-భవనాల శాఖ రోడ్లపై గుంతలు పూడుతున్నాయి. కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలో 510 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు విస్తరించాయి. వైసీపీ పాలనలో కనీసం పట్టించుకోక పోవడంతో ఈ రోడ్లలో చాలావరకు వాహనచోదకులకు నరకప్రాయంగా తయారయ్యాయి. తాము అధికారంలోకి వస్తూనే రోడ్లను బాగుచేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే మాట నిలబెట్టుకుంటున్నారు. డివిజన్ పరిధిలోని గుంతలు పూడ్చడానికి రూ.1.28 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో ఇప్పటికే సుమారు 51 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. ఈ పనులను ఈనెల 2వ తేదీన కుప్పం మండలం వసనాడు గ్రామ పరిధిలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, కడా పీడీ వికాస్ మర్మత్ ప్రారంభించారు. తర్వాత వర్షాల వల్ల ఆలస్యమైంది. వానలు కొద్దిగా తగ్గుముఖం పట్టడంతో పనులు మళ్లీ మొదలు పెట్టారు.

విజన్ డాక్యుమెంట్‌లో ప్రతిపాదనలిలా..

డివిజన్ పరిధిలో విస్తరించిన 510 కిలోమీటర్ల రోడ్లలో ఇంకా 459 కిలోమీటర్ల రోడ్లు మిగిలిపోతాయి. వీటి మరమ్మతులకు రూ.68 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనిని కుప్పం విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచారు. మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల పనులకు రూ.34కోట్లతో ప్రతిపాదించారు. రూ.18 కోట్ల విలువైన ప్రతిపాదనలు స్టేట్ హైవే మరమ్మతులకు సంబంధించినవి. రూ.16 కోట్లతో ఇతర రోడ్ల మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇటీవల కడా పీడీ వికాస్ మర్మత్ సమర్పించారు. ప్రభుత్వం ఆమోదం పొందితే డివిజన్‌లోని రోడ్లకు మహర్దశ పట్టనుంది. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ దస్తగిరి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్‌కు గ్రీన్‌సిగ్నల్ రాగానే మిగిలిన రోడ్లకు కూడా మరమ్మతులు చేపడతామన్నారు.

ఎన్‌పీసీఐతో బ్యాంకు ఖాతాల అనుసంధానం వేగవంతం


చౌడేపల్లెలో రాత్రివేళలో పోస్టల్ అకౌంట్ ఓపెన్ చేస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో వరద ముంచెత్తింది. తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా బాధితులైన కొందరి బ్యాంకు ఖాతాలు.. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో అనుసంధానం కాలేదు. దీని వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం స్వీకరణలో వీరు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ ఎన్‌పీసీఐతో బ్యాంకు ఖాతాలు అనుసంధానం కానివారిని గుర్తించారు. అలాగే 18 ఏళ్లు దాటినా బ్యాంకు ఖాతాల్లేని వివరాలను సేకరించారు. ఈ జాబితాల ప్రకారం గ్రామ, వార్డు సచివాలయాల్లోని సంక్షేమ కార్యదర్శి, ఉద్యోగులు తపాలా శాఖతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్‌పీసీఐతో బ్యాంకు ఖాతాల అనుసంధానం, పోస్టల్ ఖాతా ఓపెన్ చేయడం పనులను వేగవంతం చేశారు.

1,81,966 మందికి పూర్తి

ఎన్‌పీసీఐ ప్రకారం 2,29,306 ఖాతాలకు ఆధార్ నెంబరు అనుసంధానం కాలేదని ఇటీవల గుర్తించారు. తొలుత ఈనెల 4 నుంచి 14వ తేదీవరకు అప్‌డేషన్‌కు గడువిచ్చారు. ఆ తర్వాత ఈనెల 30లోగా పొడిగించినా, పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో డిసెంబరు ఏడో తేదీలోగా చేయించాలని తాజాగా ఉన్నతస్థాయి నుంచి ఉత్తర్వులు అందాయి. ఆదివారంనాటికి 1,81,966 మందికి చేయించారు. ఇంకా 47,340 ఖాతాలు మిగిలిపోయాయి.

అత్యధికం.. అత్యల్పం

జిల్లాలో ఇంతవరకు 79.36 శాతం అప్డేషన్ జరిగింది. అత్యధికంగా చౌడేపల్లె మండలంలో 98.18 శాతం, అత్యల్పంగా ఐరాలలో 44.89శాతం జరిగింది. మున్సిపాలిటీల వారీగా.. పలమనేరులో అత్యధికంగా 95.22శాతం జరగ్గా, అత్యల్పంగా నగరిలో 70.80 శాతం జరిగింది. చిత్తూరు అర్బన్‌లో 30,220 ఖాతాలకుగాను 22,507 అనుసంధానం (74.48శాతం) జరిగింది. పుంగనూరులో 82.20 శాతం జరిగింది. కొన్నిచోట్ల లబ్ధిదారులు అందుబాటులో లేరు. ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలస వెళ్లిపోయారు. మరోవైపు సచివాలయాల్లో 50శాతం సిబ్బంది కొరత ఉండడంతో ఆధార్ అనుసంధానానికి ఇబ్బందులు ఎదురౌతున్నాయి.

త్వరగా పూర్తిచేస్తాం

ఎన్‌పీసీఐతో బ్యాంకు ఖాతాల అనుసంధానం త్వరగా పూర్తిచేస్తాం. ఇప్పటికే దాదాపు 79 శాతం పూర్తయ్యింది. బ్యాంకు ఖాతాలు లేకుంటే పోస్టల్ అకౌంట్ తెరిచి.. ప్రక్రియ చేపడుతున్నాం. వెనుకబడిన మండలాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఈనెల చివరిలోగా వందశాతం చేయించాలని ప్రణాళిక రూపొందించాం.

- రవికుమార్, జిల్లా అధికారి, జీఎస్‌డబ్ల్యూఎస్ విభాగం, చిత్తూరు

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు(పాత) కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

చిరుత సంచారం వాస్తవమే

దేవరకొండపైకి భక్తులు గుంపులుగానే వెళ్లాలి - అటవీ అధికారులు

బంగారుపాళ్యం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలీశ్వర ఆలయానికి అనుబంధంగా ఉన్న దేవరకొండలోని జలకంఠేశ్వర గుడికి వెళ్లే అటవీప్రాంతం దారిలోని ఆర్చి వద్ద శనివారం సాయంత్రం ఓ చిరుత పులి భక్తుల కంటపడడం వాస్తవమేనని అటవీ అధికారులు నిర్ధారించారు. ఆదివారం చిరుత సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించి, ఆనవాళ్లను గుర్తించారు. ఈ సందర్భంగా ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. దేవరకొండ పూర్తిగా దట్టమైన అటవీప్రాంతమని, ఇక్కడ క్రూరమృగాలు సంచరిస్తున్నాయని చెప్పారు. అటవీప్రాంతంలో ఉన్న శివపార్వతులను దర్శించుకోవానికి వెళ్లే భక్తులు గుంపులుగానే, అదీ పగటిపూట మాత్రమే వెళ్లాలని సూచించారు. అలాగే పశుకాపర్లు, సమీప గ్రామస్తులు కూడా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. తమ సిబ్బంది, ట్రాకర్ల సాయంతో సాయంత్రం వేళల్లో గస్తీ కాస్తున్నామని తెలిపారు.



చిరుతపులి ఆనవాళ్లను పరిశీలిస్తున్న అటవీ అధికారి

అమ్మో.. కొండచిలువ



రామకుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం నక్కబండపల్లెలో భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. శనివారం రాత్రి గ్రామ సమీపంలోని ఓ పొలంలో సంచరిస్తున్న సుమారు 15 అడుగుల పొడవున్న కొండచిలువను రైతులు గుర్తించారు. విషయాన్ని వారు వెంటనే అటవీ అధికారులకు తెలిపారు. ననియాల అటవీ విభాగాధికారి హరికుమార్, ముద్దనపల్లె ఎఫ్‌బీవో సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొండచిలువను సంచిలో వేసుకెళ్లి.. అడవిలోకి వదిలి పెట్టారు.

మంచు దుప్పటి


సదుంలో..


కల్లూరులో..

దట్టమైన పొగమంచు ప్రకృతి ప్రేమికులను ఆహ్లాదపరిచింది. కల్లూరు, సదుం ప్రాంతాల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం ఎనిమిది గంటలైనా దట్టమైన పొగమంచు వీడలేదు. దీంతో ఉదయం పూట కూడా వాహన చోదకులు హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. మరికొందరు ఈ వాతావరణాన్ని ఆస్వాదించారు.

- సదుం/కల్లూరు, ఆంధ్రజ్యోతి

ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసేవరకు

విద్యార్థులపై ఒత్తిడి చేయొద్దు

● కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇంటర్మీడియట్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించిన ఫీజులను రీయింబర్స్‌మెంట్ చేసేవరకు విద్యార్థులపై ఒత్తిడి చేయొద్దని యాజమాన్యాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు చెల్లించలేదని హాల్ టికెట్లు జారీ చేయకపోయినా, ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకున్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు





విజేతలుగా నిలిచిన కడప, గుంటూరు జట్లలోని క్రీడాకారులు

- విజేతలుగా కడప బాలురు, గుంటూరు బాలికలు

తవణంపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలంలోని అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్స్‌లో బాలుర విభాగంలో కడప జిల్లా విజేతగా నిలవగా, ద్వితీయ స్థానంలో విజయనగరం జిల్లా, మూడో స్థానంలో చిత్తూరు జిల్లా నిలిచాయి. బాలికల విభాగంలో గుంటూరు గెలుపొందగా ద్వితీయ స్థానంలో విజయనగరం, ఈస్ట్ గోదావరి మూడో స్థానంలో నిలిచినట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలికల విభాగంలో 16 మందిని, బాలుర విభాగంలో 16 మందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కార్యదర్శి తెలిపారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్, ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో త్యాగరాజులురెడ్డి, 13 జిల్లాల పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మణిమాలన్ కేరాఫ్ 'రిక్షా'



రిక్షాలో కుటుంబ సభ్యులతో...



పోలియోతో బాధపడుతున్న బిడ్డను చూపిస్తున్న మణిమాలన్

చిన్న చిన్న సమస్యలొస్తే కొందరు కష్టాలన్నీ తమనే చుట్టుముట్టినట్టు బాధపడిపోతారు. కొందరైతే బతుకుపై విరక్తి పెంచుకుంటారు. అలాంటి వారికి మణిమాలన్‌ను చూస్తే కొండంత గుండె నిబ్బరం వస్తుంది. చిత్తూరుకు చెందిన ఇతనికి నలుగురు పిల్లలు. రెండో కుమార్తె కీర్తి పోలియో బాధితురాలు. తల్లి, వదిన కూడా మణిమాలన్‌తోనే ఉంటున్నారు. రోజూ రూ.30కి ఓ రిక్షా అద్దెకు తీసుకుని కుటుంబ సభ్యులతో రోజంతా నగరంలో తిరుగుతాడు. వీరంతా ప్లాస్టిక్ బాటిళ్లు, పేపర్లను ఏరుకుంటారు. సాయంత్రం విక్రయిస్తే సగటున రూ.300 వస్తుంది. ఆర్థిక స్తోమత లేక పోలియో బిడ్డకు వైద్యం చేయించలేకపోయానని మణిమాలన్ చెప్పాడు. చీకటి పడగానే వేలూరు రోడ్డులోని ఆలయమెట్ల వద్ద రిక్షా నిలిపి అక్కడే నిద్రపోతామన్నాడు. ఆధార్‌కార్డు లేదు. ఉండటానికి ఓ గూడూ లేదంటూ మణిమాలన్ ఆవేదన వ్యక్తం చేశాడు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

అక్కడ భార్య.. ఇక్కడ భర్త

- రెండు స్టేషన్లలో ఒకరిపై ఒకరు వేర్వేరుగా ఫిర్యాదు
- రెండు చోట్లా కేసు నమోదు

చిత్తూరు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బిడ్డను దత్తత తీసుకునే విషయంలో భార్యభర్త ఘర్షణ పడి ఒకరిపై ఒకరు వేర్వేరు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరుకు చెందిన నందిని, శ్రీనివాసులు దంపతులు. వీరు స్థానిక దుర్గానగర్‌కాలనీలో నివాసముంటున్నారు. కొన్నేళ్లుగా సంతానం లేదు. దీంతో ఓ బిడ్డను దత్తత తీసుకోవాలని భార్యతో శ్రీనివాసులు చెప్పాడు. దీనిపై ఇద్దరి మధ్య ఘర్షణ మొదలై కొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న నందిని తరఫు బంధువులు శ్రీనివాసులుపై దాడిచేశారు. ఈ దాడిలో తలకు మూడు కుట్లు పడ్డాయి. శ్రీవాసులు కూడా భార్య తరఫు బంధువులపై దాడి చేయడంతో ఓ మహిళ గాయపడింది. ఈ ఘటనకు సంబంధించి నందిని మహిళా పోలీసు స్టేషన్‌లో, శ్రీనివాసులు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు చోట్లా పోలీసులు కేసు నమోదు చేశారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



పోలాభాస్కర్‌కు ప్రసాదం అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల (కాణి పాకం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్, డిప్యూటీ కలెక్టర్ లవన్న ఆదివారం కాణిపాకం వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వీరిని సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే స్వామిని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు చుడా చైర్‌పర్సన్‌గా కటారి హేమలత ప్రమాణ స్వీకారం

చిత్తూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మేయర్, నగర టీడీపీ అధ్యక్షురాలు కటారి హేమలత చుడా చైర్‌పర్సన్‌గా సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కూటమి నేతలు తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీల శ్రేణులకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి పిలుపునిచ్చారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

చౌడేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఉదయం వేదపండితులు అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేశారు. స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించాక భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు ఎన్టీఆర్ వజ్రోత్సవ సినీ గేయ గోష్ఠి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ తొలి సినిమా మన దేశం 1949లో విడుదలై 75 సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న సందర్భంగా సోమవారం తిరుపతిలో ఎన్టీఆర్ వజ్రోత్సవ సినీ గేయ గోష్ఠి నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్లో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమాన్ని అనంతపురానికి చెందిన మహాబోధి సాహిత్య వేదిక నిర్వహిస్తోంది. మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, రచయిత వీకేకే రంగారావు, రిటైర్డు ప్రొఫెసర్ సత్యవాణి, జిల్లాలోని ఎమ్మెల్యేలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

బాస్కెట్‌బాల్ జిల్లా సీనియర్ జట్ల ఎంపిక



మహిళా, పురుషుల జట్లకు ఎంపికైన క్రీడాకారులు

చిత్తూరు క్రీడలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ సీనియర్ మహిళల, పురుషుల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంగల్రాయన్ తెలిపారు. ఆదివారం చిత్తూరు డీఎస్ఏ మైదానంలో ఎంపికలు జరిగాయన్నారు. డిసెంబరు 6 నుంచి 9వ తేదీవరకు పశ్చిమ గోదావరిలో జరగనున్న 10వ ఏపీ అంతర్ జిల్లా బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్లు పాల్గొంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు బాబు, జాను పాల్గొన్నారు.

వరి పంట నాశనం చేసిన అడవిపందులు



35యర్లపల్లె వద్ద అడవిపందులు నాశనం చేసిన వరి పంట

ఐరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలోని 35యర్లంపల్లెలో వరిపంటపై శనివారం రాత్రి అడవిపందులు పడి నాశనం చేశాయి. ఐరాలకు చెందిన ఎంకే.కేశవులు సాగుచేసిన 20 గుంటల వరిపంట ధ్వంసమైంది. అడవిపందులు.. పొలాల వైపు రాకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నష్ట పరిహారాన్ని అందించాలని రైతు కోరుతున్నారు.

అట్టహాసంగా బేస్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాజ్యోతిని ప్రదర్శించి, పోటీలను ప్రారంభిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మంగళం జిల్లా పరిషత్ బ్రిండ్స్ పాఠశాలలో ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 14 బేస్‌బాల్ పోటీలు ఆదివారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు క్రీడా జ్యోతి వెలిగించి పోటీలకు నాంది పలికారు. సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే చర్యలు చేపడుతామన్నారు. ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. డీవైఈవో బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక, శారీరక పెరుగుదల ఉంటుందన్నారు. పాఠశాల హెచ్ఎం కేశవులనాయుడు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు సమప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. 13ఉమ్మడి జిల్లాల నుంచి 418మంది బాలబాలికలు, 50మంది కోచ్‌లు, మేనేజర్లు పోటీలకు హాజరయ్యారు.

తొలిరోజు లీగ్ పోటీల ఫలితాలిలా...

- బాలికల విభాగంలో: ప్రకాశంపై శ్రీకాకుళం, అనంతపురంపై పశ్చిమగోదావరి జట్లు విజయం సాధించాయి.
- బాలుర విభాగంలో: నెల్లూరుపై కృష్ణా, కర్నూలుపై పశ్చిమగోదావరి, కృష్ణాపై శ్రీకాకుళం, పశ్చిమగోదావరిపై ప్రకాశం, గుంటూరుపై విశాఖపట్నం జట్లు విజయకేతనం ఎగురవేశాయి.

అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు


- ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణమా..?




నవాజ్ (ఫైల్ ఫొటో)

వి.కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం కొంగాటం పంచాయతీ చింతల ఎల్లాగరానికి చెందిన నవాజ్ అలియాస్ అల్లు (27) అదృశ్యమై మూడు రోజుల తర్వాత శవమై తేలాడు. వివరాలివి. ఇటీవల నవాజ్.. గ్రామానికి చెందిన సర్దార్‌తో చేపల వేటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో సర్దార్‌ను కుటుంబ సభ్యులు గట్టిగా నిలదీశారు. తర్వాత అతను గ్రామం విడిచి పరారయ్యాడు. నవాజ్ తల్లి రెహానా మూడురోజుల క్రితం తమ బిడ్డ అదృశ్యంపై సీఐ సోమశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సర్దార్ కుటుంబ సభ్యులను లోతుగా విచారించారు. సర్దార్‌కు, నవాజ్‌కు మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని విచారణలో తేలింది. తానే నవాజ్‌ను అంత మొందించి పాలారు నదిలో పడేసినట్లు సర్దార్ తన కుటుంబ సభ్యులకు ఫోన్‌లో చెప్పినట్లు సమాచారం. ఈక్రమంలో రామకుప్పం మండలం కొంగనపల్లె పరిసరాల్లో నదిలోని పొదల్లో నవాజ్ శవాన్ని గ్రామస్థులు గుర్తించారు. హత్య చేసి.. శవానికి డ్రిప్ పైపులు చుట్టి పొదల్లో పడేసినట్లు భావిస్తున్నారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వెలుగులీనుతున్న తిరుచానూరు







విద్యుద్దీప కాంతుల్లో తిరుచానూరు వెలిగిపోతోంది. గురువారం నుంచి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ క్రమంలో ఆలయం, తిరుమాడవీధులు, పుష్కరిణి, గాలిగోపురం, ఉద్యానవనం తదితర ప్రాంతాలు ఆదివారం రాత్రి విద్యుద్దీపాలంకరణతో కనువిందు చేస్తున్నాయి. ఇక, రంగవల్లులతో మాడవీధులను తీర్చిదిద్దారు. ఉద్యానవనంలో చలువ పందిళ్లు వేస్తున్నారు. ఫ్లైడే గార్డెన్‌లో ఫల, పుష్ప ప్రదర్శనను తీర్చిదిద్దుతున్నారు. సోమవారం నాటికి ఏర్పాట్లు పూర్తవుతాయని టీటీడీ అధికారులు అంటున్నారు. గురువారం నుంచి బ్రహ్మోత్సవాలు ముగిసే వచ్చే నెల 8వ తేది వరకు అన్ని ఆర్జిత సేవలు, కుంకుమార్చన, వేదాశీర్వచనం, వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- ఎల్లుండి లక్ష కుంకుమార్చన

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. ఈ సందర్భంగా ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను టీటీడీ రద్దు చేసింది. శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. గృహస్తులు (ఇద్దరు) రూ.1,116 చెల్లించి టికెట్ కొని ఈ సేవలో పాల్గొనవచ్చు. వీరికి ఒక ఉత్తరీయం, రవికె, రెండు లడ్లు, రెండు వడలు బహుమానంగా అందజేస్తారు. ఆలయం వద్ద కౌంటర్‌లో కరెంట్ బుకింగ్‌లో ఈ టికెట్లు పొందవచ్చు. అదే రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పుణ్యాహవచనం, రక్షాబంధనం, నాలుగు మాడ వీధుల్లో సేనాధిపతి ఉత్సవం, అనంతరం అంకురార్పణ నిర్వహిస్తారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

రేపు బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్ కార్యవర్గ సమావేశం తిరుమల బైపాస్ రోడ్డులోని శ్రీకాళహస్తీశ్వర ఆర్యవైశ్య వాసవీ సత్రంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఏపీ సర్కిల్ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017 జనవరి 1 నుంచి పెన్షనర్ల వేతన సవరణతో పాటు పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అదే వేదికపై బుధవారం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరుగుతుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుర్రప్ప, సౌందర్యరాజన్ తెలిపారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన వివరాలు.. ఎస్ఐ నరసింహారావు, సిబ్బందితో కలిసి శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రం పాలక్కాడ్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ నజీర్, కృష్ణకుమార్ రెండు గోనె సంచుల్లో గంజాయిని ఉంచుకుని రోడ్డు పక్కన నిలబడి ఉండగా అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి 8.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసన్



శ్రీనివాసన్‌కు నియామక పత్రాన్ని ఇస్తున్న ఎన్నికల అధికారి చిరంజీవి

చిత్తూరు అర్బన్, నవంబరు 24: ఉమ్మడి జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ ముగిసింది. అధ్యక్ష పదవికి శ్రీనివాసన్ (వ్యవసాయ శాఖ డ్రైవర్), తాజా అధ్యక్షుడు పన్నీర్‌సెల్వంలు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ పరిశీలనలో పన్నీర్‌సెల్వం నామినేషన్ పత్రంలో తప్పులు, దిద్దుబాట్లు ఉండడే కారణాన్ని చూపి ఎన్నికల అధికారి చిరంజీవి ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. దీంతో పన్నీర్‌సెల్వం ఎన్నికల అధికారితో వాగ్వాదానికి దిగారు. పోటీచేసిన ఇరువర్గాల వారు అరుపులు, కేకలతో వాగ్వివాదానికి దిగారు. చివరకు శ్రీనివాసన్ ఉమ్మడి జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికల అధికారి చిరంజీవి ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు శ్రీనివాసన్ మాట్లాడుతూ డ్రైవర్లకు అండగా ఉంటానన్నారు. త్వరలోనే జిల్లా కార్యవర్గాన్ని నియమిస్తామని వివరించారు.

రాష్ట్ర స్థాయి వుడ్‌బాల్ చాంప్‌గా చిత్తూరు



విజేతలకు బహుమతుల అందజేత

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వుడ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీ విజేతలుగా చిత్తూరు, అన్నమయ్య జిల్లా జట్లు నిలిచాయి. ఏపీ వుడ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి ప్రభాకర్ ఈ విషయం తెలిపారు. కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో చిత్తూరు, విజయనగరం జిల్లా జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. చిత్తూరు జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో అన్నమయ్య, తిరుపతి జిల్లా జట్లు హోరాహోరీగా పోటీపడ్డాయి. అన్నమయ్య జిల్లా జట్టు గెలుపొందింది. బాలికల రన్నర్‌గా విజయనగరం, బాలుర రన్నర్‌గా తిరుపతి జట్లు నిలిచాయి. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. స్పాన్సర్లు షట్లా అనీల్‌కుమార్, కరుణాకర్ నాయుడు, షేక్ అష్రఫ్, అమూరి మహేష్, నిర్వాహకులు వెంకటరమణ, అబ్దుల్ రెహ్మాన్, మల్లికార్జున, పుష్ప, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేలపట్టులో సందర్శకుల సందడి



నేలపట్టు పక్షుల కేంద్రంలోని విడిదిలో ఉన్న విదేశీ విహంగాలు





పక్షులను వీక్షిస్తున్న సందర్శకులు, జర్మనీ దేశస్థులతో టూరిజం గైడ్ హుస్సేన్

దొరవారిసత్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం సందర్శకులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో పక్షుల కేంద్రంలోని విడిదిలో ఉన్న విహంగాలను చూసేందుకు తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి సందర్శకులు విచ్చేశారు. శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌ల్లో పనిచేసే ఉద్యోగులు కూడ నేలపట్టుకు వచ్చారు. చెరువుల కట్టలపైన ఉన్న వాచ్ టవర్స్, సందర్శన ప్రాంతాల నుంచి పక్షులను వీక్షించారు. వన్యప్రాణి సంరక్షణ శాఖ ఏర్పాటు చేసిన బైనాక్యులర్ల ద్వారా దూరంలో ఉండే పక్షులనూ వీక్షించారు. స్థానిక టూరిజం గైడ్ హుస్సేన్ పక్షుల ప్రాముఖ్యత, వాటి జీవన విధానాల గురించి సందర్శకులకు తెలియజేశారు. ఈ పక్షుల కేంద్రాన్ని జర్మనీ దేశీస్తులు సందర్శించారు. శ్రీసిటీలోని ఓ కంపెనీలో పనిచేసే కుటుంబం తమ తల్లితో కలసి పక్షులను వీక్షించారు. ఇటువంటి పక్షుల కేంద్రం అరుదుగా ఉంటుందని వారు అభిప్రాయ పడ్డారు.

టీడీపీ సభ్యత్వంతో రూ.5 లక్షల బీమా


సభ్యత్వ నమోదును పరిశీలిస్తున్న టీడీపీ నాయకుల

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో రూ.5 లక్షల బీమాతో పాటూ పలు రాయితీలు లభిస్తాయని టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, ధనంజయ నాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం మతుకువారిపల్లి, కల్లూరు, పాళెం, చల్లావారిపల్లి పంచాయతీల్లో సభ్యత్వ నమోదును ఆదివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలోని 25 పంచాయతీల్లో ఇప్పటివరకు 7500 మంది సభ్యత్వం తీసుకున్నారన్నారు. టీడీపీ నాయకులు రమేష్, రామనాథంనాయుడు, రత్నం, యుగంధర్ పాల్గొన్నారు.

మాతమ్మ మండల పూజలు



సదుం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నడిగడ్డలోని ఆలయంలో మాతమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో మండల పూజలునిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ప్రత్యేక వాహనంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



సోమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నంజంపేట పంచాయతీ సరస్వతీపురంలోని పాఠశాల కు చెందిన 30 విద్యార్థులకు ఆదివారం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆర్.జయప్రకాశ్ దుస్తులు అందజేశారు. జయప్రకాశ్ జన్మదినం పురస్కరించుకుని పిరంగులగుట్ట ఎస్టీ కాలనీకి చెందిన పలువురు వృద్ధులకు దుస్తులు, భోజనపు ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. అమృత, జగదీశ్, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

బురుజుపల్లె ఆలయ వార్షిక ఉత్సవాలు


శ్రీవారి ఆలయంలో ఉభయదారులు

సోమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లెలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక ఉత్సవాలు ప్రారంభయ్యాయి. ఈక్రమంలో ఆదివారం ఆలయంలో కలశపూజ, పుణ్యావాచకం, గణపతి హోమం నిర్వహించారు. రాత్రి అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి కల్యాణోత్సవం, రాత్రి గరుడవాహనంపై ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

సోమల, నవంబరు 24((ఆంధ్రజ్యోతి): చిన్న సోమల సమీప పాఠశాల వద్ద ఆదివారం బోయకొండ గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచన, కలశపూజ, మహాగణపతి హోమం, కళాహోయం, మూర్తి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోదర్శం మహా మంగళ హారతి కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమాలను రామిశెట్టి రమణ, హరిమునివెంకటాచారి తదితరులు పర్యవేక్షించారు.

మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

కుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చికెన్, మాంసం, చేపల దుకాణాలను ఆదివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. "కొందరు వ్యాపారులు, నాణ్యతలేని, అనారోగ్యకరమైన చికెన్, చేపలను విక్రయిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు జరిపారు. కృష్ణగిరి సర్కిల్, కొత్తపేట, చెరువు కట్ట, ఎంపీడీవో కార్యాలయం ఎదుట దుకాణాలకు వెళ్లి నాణ్యతను పరిశీలించారు. అనారోగ్యకరమైన, నిల్వ ఉన్నవాటిని విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ వ్యాపారులను హెచ్చరించారు.

వన్నెయకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



కుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వన్నెయకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన వామనమూర్తిని ని యోజకవర్గ జనసేన ఇన్‌చార్జి నరేశ్‌తోపాటు పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఆదివారం సన్మాన సభలో నరేశ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని జనసేన కార్యకర్తలకు, వీర మహిళలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. వామనమూర్తి మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, పసుపులేటి హరిప్రసాద్‌కు, నరేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

కుప్పంలో పూర్వ విద్యార్థుల కలయిక



కుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2004లో పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో వృత్తి ఉద్యోగాల్లో స్థిరపడిన నాటి విద్యార్థులు కలిసి జ్ఞాపకాలను పంచుకున్నారు. మధుర స్మృతులను కలబోసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి: ఎస్‌ఐ

రామకుప్పం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నేరాల నిరోధానికి అందరూ సహకరించాలని ఎస్‌ఐ వెంకట మోహన్ కోరారు. ఆదివారం ఆయన టీడీపీ నేతల సమావేశంలో మాట్లాడారు. ఇళ్ళు, దేవాలయాలు, ప్రార్థనమందిరాల వద్ద సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. దీనివల్ల నేరస్తులను సులభంగా గుర్తించవచ్చునన్నారు. ఆటోమేటిక్ తాళాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీస్‌స్టేషనుకు సమాచారమివ్వాలన్నారు. సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్టనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పుంగనూరు రూరల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి సందర్భంగా ఏపీజె అబ్దుల్‌కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం మండల పరిధిలోని గూడూరుపల్లె సమీపంలోని టిడ్కో ఇళ్లలో కుప్పం పీఈఎస్ ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 500మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్, ఎస్వీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్‌రెడ్డిలు పగడాల రమణ, తోట గిరిధర్, నరసింహులు, త్రిమూర్తిరెడ్డి, మరంబాబు, నారదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి గ్రీవెన్స్ డే రద్దు

కుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను అనివార్య కారణాల వల్ల రద్దయింది. పీడీ ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

వాలీబాల్ విజేత ముత్తుకూరు


గెలుపొందిన ముత్తుకూరు క్రీడాకారులు

చౌడేపల్లె, నవంబరు24:(ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వాలీబాల్ పోటీలు హోరా హోరిగా జరిగాయి. స్థానిక హైస్కూల్‌లో జరిగిన ఈ పోటీలకు జిల్లా నుంచి 25 జట్లు పాల్గొన్నాయి. ముత్తుకూరు జట్టు గెలుపొంది మొదటి బహుమతిగా రూ.9000తో పాటు కప్‌ను గెలుచుకుంది. రెండవ స్థానంలో చిన్నేపల్లె జట్టు నిలిచింది. వీరు రూ.6000 నగదు బహుమతి పొందారు.

నెలాఖరు లోపు పంటబీమా ప్రీమియం చెల్లించాలి

పుంగనూరు రూరల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించాలని ఏడీఏ శివకుమార్‌రాజు సూచించారు. ఆదివారం మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంట బీమా నమోదుకు ముందుకు రావాలన్నారు. ఈనెల నుంచి పీఎం ఫసల్ బీమా యోజన పథకం కింద వరికి ఎకరానికి రూ.84, వేరుశెనగకు రూ.60 ఈనెల 31లోపు చెల్లించాలన్నారు. బ్యాంకులో రుణాలు పొందిన రైతులు ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వివవరాలకు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


నిందితుడితో పోలీసులు

పెద్దపంజాణి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం కరసనపల్లె సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా శివరాజ అనే వ్యక్తిని గుర్తించారు. ఇతడు కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంలో మద్యంతోపాటు లీటరు నాటుసారా తరలిస్తున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసి మద్యం, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సహదేవీ తెలిపారు.

ఆగిన రోడ్ల నిర్మాణంతో ప్రజల అవస్థలు


కంకరకే పరిమితమైన గంగవరం మండలం అప్పిశెట్టిపల్లి-పలమనేరు మండలం ఎంకోటూరు- సముద్రపల్లి రోడ్లు

పలమనేరు, బైరెడ్డిపల్లి, గంగవరం, వి.కోట మండలాల్లో పలుగ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొన్ని గ్రామీణ రహదారుల పనులు చేపట్టి అర్థాంతరంగా నిలిపివేసింది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర మాత్రమే వేసి దానిపై బీటీ వేయక పోవడంతో పాదచారులు, వాహనదారులు పరీక్ష పెడుతున్నాయి.. గత ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల ముందు నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్లు పనులు చేపట్టి ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో 30కి పైగా గ్రామీణ రహదారి రోడ్డుపనులు అర్థాంతరంగా ఆపివేశాను. ప్రభుత్వం స్పందించి కంకర రోడ్డుపై బీటీ వేసి పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు. -పలమనేరు(ఆంధ్రజ్యోతి)

వైభవంగా వారాహి యజ్ఞం



కుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివశక్తి కళ్యాణ మండపంలో సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు ఆధ్వర్యంలో శనివారం రాత్రి మహా వారాహి యజ్ఞం వైభవంగా జరిగింది. తిరుచానూరు శక్తి టెంపుల్ ట్రస్టుకు చెందిన రుద్ర వారాహి స్వామివారు ఈ యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు అనుగ్రహ భాషణం చేస్తూ వారాహి అమ్మవారు వరాలిచ్చే కల్పవల్లి అన్నారు. ప్రజలు దయాగుణం అలరవచుకుని పేదలకు సేవ చేయాలని ఉద్బోధించారు. పట్టణ ప్రముఖులతోపాటు సామాన్య భక్తులు పెద్ద సంఖ్యలో వారాహి యజ్ఞంలో పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరాలు


పరీక్షలు చేస్తున్న పీఈఎస్ నేత్రవైద్యులు

పలమనేరు, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో హోం, లయన్స్‌క్లబ్‌ల్లో ఆదివారం ఉచిత నేత్రచికిత్సా శిబిరాలు నిర్వహించారు. ఎన్జీవోహోంలో ఎన్జీఓ సంఘం, పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి నేత్రవైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఎన్జీఓ సంఘం నాయకులు ఆనంద్‌బాబు, పీపీఎస్ నాయకులు నరసింహులు, అగర్వాల్ ఆసుపత్రి వైద్యులు పల్లవి, మణికంఠ, బాలాజి, మేనేజర్ ఆంజనేయులు, పీపీఎస్ సభ్యులు జగన్నాథం, దొరస్వామి, నారాయణ, సాంబయ్య, సన్నిరాజు తదితరులు పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్‌లో కుప్పం పీఈస్ ఆసుపత్రి నేత్రవైద్యులు 72 మందికి పరీక్షలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు జయశంకర్, కార్యదర్శి బీసీరవి, కోశాధికారి పుహలేంది, సభ్యులు శ్రీరాములుశెట్టి, చంద్రయ్యశెట్టి, రమేష్, దివాకర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును మండలంలో వేగవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం రామకుప్పంలో సభ్యత్వ నమోదుపై పార్టీశ్రేణులతో సమీక్ష జరిగింది. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్టనారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ, వైస్‌ఎంపీపీలు ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణలు మాట్లాడారు. సభ్యత్వ నమోదులో కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలపాలన్నారు. పార్టీ నాయకులు విశ్వనాథ్, వెంకటాచలం, రామూర్తి, సీతాపతి, గంట్లప్ప గౌడు, కొళ్ళుపల్లెబాబు, నందారెడ్డి, మనోహర్, కామరాజనాయక్ తదితరులు పాల్గొన్నారు

కారు బోల్తా.. ప్రయాణికులు క్షేమం

పూతలపట్టు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కారు బోల్తాపడింది. అదృష్టవశాత్తు అందులోని వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. నెల్లూరుకు చెందిన గౌతమ్ శ్రీనివాస్ కెనరా బ్యాంకులో మేనేజర్. ఈయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం వేలూరుకు కారులో బయలుదేరాడు. కారు పూతలపట్టు మండలం వేమూ ఇంజినీరింగ్ కళాశాల సమీపాన వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారు చక్రాలు విరిగి పడిపోయి, కారు నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో గౌతమ్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

నేడు బ్రహ్మకుమారీస్ జ్యోతిర్లింగ ప్రదర్శన

చిత్తూరు కల్చరల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): కట్టమంచి వరదరాజస్వామి ఆలయ వీధిలో కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా ప్రజాహిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనం సోమవారం ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించనున్నామని భక్తులు, నగరవాసులు జ్యోతిర్లింగాలను దర్శించి తరించాలని కోరారు.

8న గ్రంథావిష్కరణలు

చిత్తూరు కల్చరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక తపోవనం హైస్కూల్లో డిసెంబరు 8న గద్వాల సోమన్న రచించిన తొలకరి జల్లులు, క్రిష్ణదాస్ రచించిన తత్వాలు - కీర్తనలు-2 గ్రంథావిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హరివిల్లు లలితా కళావేదిక నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరంలోని కళాకారులు, సాహితీవేత్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

హుండీ చోరీ



యాదమరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్దానపల్లి గంగమ్మ ఆలయం హుండీని పగులగొట్టి, అందులోని నగదును దొంగలు దోచుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని మోర్దానపల్లి గ్రామశివారులో ఉన్న గంగమ్మ గుడిలో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ప్రధాన ఆలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన హుండీని పెకిలించి సమీపంలో చెరువు వద్దకు తీసుకెళ్లి అందులో భక్తులు సమర్పించిన సుమారు రూ.30వేల నగదు దోపిడీ చేశారు. ఖాళీ హుండీ పడేసి పారిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఓటర్ల జాబితాలో మార్పు, చేర్పులకు అవకాశం

పెనుమూరు, నవంబరు 24 ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అవకాశం ఉందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారు మోహన్‌రాజ తెలిపారు. ఆదివారం ఆయన మండలంలో జరుగుతున్న ఓటర్ల జాబితాలో మార్పు చేర్పుల కోసం ఏర్పాటు చేసిన క్యాంపులను తనిఖీ చేశారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలతో మాట్లాడారు. ముందు గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కల్పించాలని వారికి సూచించారు. అప్పుడే వారు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో నందిని, బీఎల్‌వోలు లాంచన, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

కళ్లాలు లేక హైవే మీద ఇలా..



పలమనేరు, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : కళ్లాలు లేక రైతులు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. ప్రత్యామ్నాయంలేక బెంగళూరు- చెన్నై జాతీయ రహదారిపై కూడా గ్రామీణ ప్రాంత రైతులు వరి, రాగి పంటల నూర్పిడి చేసి ఎండ బెడుతున్నారు. ఈ రహదారిపై రోజూ 40 వేలకు పైగా వాహనాలు రాకపోలకు సాగిస్తాయి. ఈ రోడ్డుపై కొంతభాగం పంటలను నూర్పిడికి వినియోగిస్తుండటం వాహనచోదకులకు కూడా ఇబ్బందిగా తయారయింది. వేగంగా వెళ్తున్న వాహనాలు ఎదురుగా వస్తున్న వాహనాలకు సైడ్ ఇవ్వడం పరీక్షగా తయారైంది. దీనిపై వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రైతులకు ప్రత్యామ్నాయం చూపి జాతీయ రహదారిని నూర్పిడికి వాడకుండా చూడాలని కోరుతున్నారు.

మాముడుగు వద్ద హైవేలో ధాన్యం ఎండబోసిన రైతులు

గ్రామీణ రోడ్లకు మహర్దశ


గుడిపాల మండలంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు

గుడిపాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 5.65 కోట్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. 75 పనులకుగాను 18 పనులు నిర్మాణ దశలో సాగుతున్నాయి. కొన్నేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో గ్రామస్తులు ఎంపీ, ఎమ్మెల్యేలకు విన్నవించడంతో వారు స్పందించి నిధులు మంజూరు చేయించారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం




ఐరాల(కాణిపాకం), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ ట్రస్టుకు రాజమండ్రికి చెందిన నంబూరి గోపాలకృష్ణ ఆదివారం రూ.1,01,116 విరాళంగా చెక్కు రూపంలో అందించారు. దాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో దాతను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం

వెదురుకుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మారేపల్లి గ్రామ పంచాయతీ చెత్త సేకరణ కేంద్రంలో విధులు నిర్వహించే కార్మికుడు మారేపల్లి కాలనీకి చెందిన కావలి శ్రీనివాసులు(38) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్ చంద్ ఆ గ్రామానికి చేరుకుని ఆయన మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు


చౌడేపల్లి వద్ద రోడ్డు పక్కన గుంతలో పడ్డ వాహనం

చౌడేపల్లె, నవంబరు24:(ఆంధ్రజ్యోతి): మినీలారీ బోల్తా పడటంలో ఇద్దరు గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు వివరాలు..కుప్పంకు చెందిన డ్రైవర్ కృష్ణ (49), అతనితో పాటు సుబ్రహ్మణ్యం (45), బాల రాజు, మహేష్‌లు కలసి కాళహస్తీ నుంచి కాళీ వాహనంతో మదనపల్లె డ్రిప్ పరికరాల బాడుగకోసం పోతున్నారు. ఈక్రమంలో చౌడేపల్లె లోని జూనియర్ కాలేజి మలుపు వద్ద ఈచర్ వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి గుంతలో బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్ కృష్ణకు తలకు బలమైన గాయం కాగా, సుబ్రహ్మణంకు కాలు విరిగింది, మహేష్‌కు స్వల్ప గాయలు అయ్యాయి. బాధితులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు కల్పించి, మేరుగైన చికిత్సల కోసం మదనపల్లెకు 108 వాహనంలో తరలించారు.

●కల్లూరు: ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మొరవపల్లికి చెందిన గణేష్ ఆదివారం రాత్రి ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై పీలేరు వైపు నడిచి వెళుతున్నాడు. అదే సమయంలో ద్విచక్రవాహనం ఢీకొనడంతో గణేష్ ఎడమకాలు, ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

●పుంగనూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కుమ్మరనత్తం పంచాయతీ కల్లుపల్లెకు చెందిన పద్మావతమ్మ అనే వృద్ధురాలు ఆదివారం తూర్పుమొగసాలలో రోడ్డుపై నడిచి వెళుతుండగా సుబేదార్‌వీధికి చెందిన అక్బర్, షేక్ అలీము నీర్‌లు ద్విచక్రవాహనంతో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచలన మేరకు క్షతగాత్రులను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

గోసంరక్షణ ట్రస్టుకు లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు రాజమండ్రికి చెందిన నంబూరిగోపాలకృష్ణ ఆదివారం రూ.1,01,116 విరాళంగా చెక్కు రూపంలో అందించారు. దాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో దాతను వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో చెత్త తొలగింపు



గంగమ్మగుడి సమీపంలో మురుగునీటి కాలువను తొలగింపజేస్తున్న సర్పంచ్ కుమారుడు దామోదర్ నాయుడు

శ్రీరంగరాజపురం, 24(ఆంధ్రజ్యోతి): గంగమ్మ గుడి గ్రామంలో అధికారులు ఆదివారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. సమీపంలోని చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారి సమీపంలోని కాలువలో మురుగు స్తంభించి దోమలకు నిలయంగా మారింది. దుర్గంధ వెదజల్లుతోంది. దీనికి తోడు వాతావరణ మార్పుతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రధానంగా జనం జర్వాల బారినపడి ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురి తమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం సర్పంచ్ లక్ష్మమ్మ కుమారుడు దామోదర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి బాలరాజు, గంగమ్మగుడి మురుగుకాలువలోని చెత్తను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. దోమలు మందు పిచికారి చేయించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన యువకుడు

ఐరాల(కాణిపాకం)నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. కాణిపాకం ఎస్‌ఐ ధరణిధర కథనం మేరకు.. ముదిగోళం రాము తిరుపతి నుంచి యల్లంపల్లెకు, వైఎస్.గేటు నుంచి పృథ్వీరాజ్ ఇద్దరూ ద్విచక్రవాహనాలపై వెళుతుండగా ఎం.పైపల్లె వద్ద ఒకదానితో ఒకటి ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన



చిత్తూరు కల్చరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాములగుడి వీధిలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి నగరవాసుల నుంచి విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల వైద్యుల సహకారంతో 128 మందికి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారు. 61 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారికి జైన్ సంఘం అన్ని ఖర్చులు భరించి వైద్యం చేయించనున్నట్లు జైన్ సంఘం అధ్యక్షులు సుభాష్ జైన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, ఎవంత్, కమలేష్, అమిత్ జైన్లు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

చిత్తూరు కల్చరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 5న విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే హైందవ శంఖారావానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో హిందూవులు తరలిరావాలని జిల్లా విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. ఆదివారం వారు బ్రాహ్మణ వీధి గీతాసంఘం భవనంలో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు శివ, బాలాజీ, సునీల్, గోపాల్, హేమలత, జ్యోతి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మకుమారీస్ జ్యోతిర్లింగ ప్రదర్శన



చిత్తూరు కల్చరల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): కట్టమంచి వరదరాజస్వామి ఆలయ వీధిలో కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనం సోమవారం ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించనున్నామని భక్తులు, నగరవాసులు జ్యోతిర్లింగాలను దర్శించి తరించాలని కోరారు.

8న గ్రంథావిష్కరణలు

చిత్తూరు కల్చరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక తపోవనం హైస్కూల్లో డిసెంబరు 8న గద్వాల సోమన్న రచించిన తొలకరి జల్లులు, క్రిష్ణదాస్ రచించిన తత్వాలు - కీర్తనలు-2 గ్రంథావిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హరివిల్లు లలితా కళావేదిక నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాకారులు, సాహితీ వేత్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

బీజేపీ సంబరాలు



గంగాధరనెల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ విజయం సాధించడంపై గంగాధరనెల్లూరులో ఆదివారం బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర బీజేపీ ఓబీసీ కార్యవర్గ సభ్యుడు ఇడగొట్టి సుధాకర్, జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా మాజీ ప్రధానకార్యదర్శి సుందరరాజు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నారాయణాచారి, నాయకులు సుబ్రమణ్యం, ఏసు, రవి, సురేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

పంచాయతీ కాంప్లెక్స్ ప్రారంభించేదెప్పుడు?

పూతలపట్టు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలకేంద్రంలో రైతులు, వ్యాపారస్తులకోసం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పంచాయతీ కాంప్లెక్స్ వైసీపీ నేతల పుణ్యమాన ఒకటిన్నరేళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో పంచాయతీకి లక్షలాది రూపాయిలు గండిపడుతోంది. పూతలపట్టు - పోలవరం రోడ్డులో వారపుసంత సమీపాన జడ్పీ నిధులతో రూ.50 లక్షలు వెచ్చించి ఏడాదిన్నర కిందట పంచాయతీ కాంప్లెక్స్‌ను నిర్మించారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులమీదుగా ప్రారంభించాలని నిర్ణయానికి రావడంతో కాంప్లెక్స్ ప్రారంభోత్సవాన్ని అధికారులు పక్కన పెట్టేశారు. ఇదిలా వుండగా, పంచాయతీ కాంప్లెక్స్ షటర్లకు తాళాలు వేయకపోవడంతో కొంతమంది వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన గ్రామస్థాయి నాయకులు ఆ గదుల్లో వ్యాపారాలు మొదలుపెట్టారు. ఈ తతంగం అధికారులకు తెలిసినా కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. ఒకటిన్నర ఏడాదికాలంగా గదులను వినియోగంలోనికి తెచ్చివుంటే ప్రభుత్వానికి ఎంతో ఆదాయం ఒనగూరేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంప్లెక్స్‌ను ప్రారంభించి గదులను అద్దెకు ఇస్తారేమోనని రైతులు, వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభానికి నోచుకోని పంచాయతీ కాంప్లెక్స్

కొట్రకోన శివాలయంలో నేడు కార్తీక సోమవారం పూజలు

గంగాధరనెల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్రకోన గ్రామంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తీక సోమవారం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, ఆలయ ప్రధానకార్యదర్శి యుగంధరాచారి తెలిపారు. అలాగే డిసెంబరు నెల 2, 9వతేదీల్లో కార్తీక సోమవారం పూజల్లో రుద్రాభిషేకం, జ్యోతి ఆరాధనలు, 13వ తేదీన మహాన్యాస రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, జ్వాలా తోరణం, అఖిలాండదీపోత్సవం జరుగుతాయని వివరించారు.

లక్ష్మీనారాయణుడికి పూజలు

గంగాధరనెల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక ఆరాధన, అర్చన పూజలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతారిణి వనజకుమారి హరికథా కాలక్షేపం చేయగా, అన్నమయ్య కీర్తనలు, వెంకటేశ్వర భక్తిగీతాలను వీరాంజనేయులు ఆలపించారు. ఈకార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్, భక్తులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ప్రయాణికులు క్షేమం

పూతలపట్టు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కారు బోల్తాపడింది. అదృష్టవశాత్తూ అందులోని వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. నెల్లూరుకు చెందిన గౌతమ్ శ్రీనివాస్ కెనరా బ్యాంకులో మేనేజర్. ఈయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం వేలూరుకు కారులో బయలుదేరాడు. కారు పూతలపట్టు మండలం వేమూ ఇంజినీరింగ్ కళాశాల సమీపాన వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారు చక్రాలు విరిగి పడిపోయి, కారు నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో గౌతమ్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



గుడిపాల మండలంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణపనులు

గుడిపాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 5.65 కోట్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. 75 పనులకుగాను 18 పనులు నిర్మాణ దశలో సాగుతున్నాయి. కొన్నేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో గ్రామస్థులు ఎంపీ, ఎమ్మెల్యేలకు విన్నవించడంతో వారు స్పందించి నిధులు మంజూరు చేయించారు.

కమ్మతిమ్మాపల్లిలో పడి పూజ



గుడిపాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అయ్యప్ప పడిగట్టు పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని వసంతాపురం, కమ్మతిమ్మాపల్లి గ్రామాల్లో అరటిపట్టలతో అయ్యప్ప ఆలయం నిర్మించారు. అయ్యప్ప పాటలు ఆలపిస్తూ భజనలు చేశారు. అయ్యప్పకు ఇష్టమైన నైవేద్యాలను సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.





బొమ్మసముద్రం రైల్వేగేటు వద్ద నత్తనడకన జరుగుతున్న నిర్మాణ పనులు, గేటు వద్ద దిగి అటువైపు నుంచి ఇటువైపు వస్తున్న విద్యార్థులు

బొమ్మసముద్రం గేటు తెరుచుకునేదెన్నడు..?

గుడిపాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా ఈ దారిలో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బొమ్మసముద్రం రైల్వే గేటు వద్ద పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీనివల్ల డీబీ పల్లె, నంగమంగళం, శాంతిపురం, గురుగునత్తం, మండ్రిక్రిష్టాపురం గ్రామస్థులు చెన్నై, చిత్తూరు, రాణిపేట వెళ్లడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాల ప్రజలందరూ బొమ్మసముద్రం గేటు వరకు వాహనాల్లో వచ్చి ఆగిపోవాల్సి వస్తోంది. అక్కడ వాహనాలు దిగి గేటుకు అవతలకు నడిచి వెళ్లి వేరే వాహనాల్లో గమ్యానికి చేరుకుంటున్నారు. తిరుగు ప్రయాణంలోనూ ఇలాగే గేటు వరకు వాహనాల్లో వచ్చి గేటు దాటి వేరే వాహనాల్లో గ్రామాలకు వెళుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు, ఇళ్లకు సమయానికి చేరలేకున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్సులు వచ్చినా గేటువరకే వచ్చి ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏడాదిగా ఇదే పరిస్థితి. హైవే అధికారులు స్పందించి గేటు వద్ద బ్రిడ్జి కింద వెళ్లే దారిలో వాహనాల రాకపోకలకైనా అనుమతించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఎన్నాళ్లీ అవస్థలని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి పనులు త్వరగా చేపట్టాలని కోరుతున్నారు.

ఓటర్ల జాబితాలో మార్పు, చేర్పులకు అవకాశం



24వ పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌వోతో మాట్లాడుతున్న మోహన్‌రాజ

పెనుమూరు, నవంబరు 24 ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అవకాశం ఉందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారు మోహన్‌రాజ తెలిపారు. ఆదివారం ఆయన మండలంలో జరుగుతున్న ఓటర్ల జాబితాలో మార్పు చేర్పుల కోసం ఏర్పాటు చేసిన క్యాంపులను తనిఖీ చేశారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలతో మాట్లాడారు. ముందు గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కల్పించాలని వారికి సూచించారు. అప్పుడే వారు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో నందిని, బీఎల్‌వోలు లాంచన, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం



ఆర్థికసాయమిస్తున్న గురుసాల కిషన్‌చంద్, పక్కన నాయకులు భాస్కర్, చక్రి, సుధాకర్, మురళి

వెదురుకుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మారేపల్లి గ్రామ పంచాయతీ చెత్త సేకరణ కేంద్రంలో విధులు నిర్వహించే కార్మికుడు మారేపల్లి కాలనీకి చెందిన కావలి శ్రీనివాసులు(38) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్ చంద్ ఆ గ్రామానికి చేరుకుని ఆయన మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కావలి చక్రి, సుధాకర్, మురళి, భాస్కర్, అర్జున్ ఉన్నారు.

ఐటీఐ భవన నిర్మాణం కలేనా?





నిర్మాణ దశలో ఆగిపోయిన ఐటీఐ భవనం, ఆరుబయట కూర్చొని ఉన్న విద్యార్థులు

వెదురుకుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంవత్సరాలు గడిచాయి. వసతులు ఉన్న సొంత భవనం మాత్రం వెదురుకుప్పం ఐటీఐ విద్యార్థులకు లేదు. వెదురుకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాల్లోని శిథిల భవనంలో ఐటీఐ ఉంది. ఆనాటి పుత్తూరు ఎమ్మెల్యే గాలి ముద్దుకృష్ణమనాయుడు చొరవతో 22.10.2008వ తేదిన వెదురుకుప్పంకు ఐటీఐ మంజూరు చేయించారు. ఆ రోజుల్లో తాత్కాలికంగా వెదురుకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐటీఐని ప్రారంభిస్తే ఈ రోజుకీ అక్కడే. ఆ తర్వాత సొంత భవన నిర్మాణాల కోసం ఏపీ స్టేట్ గవర్నమెంటు రూ.3కోట్లను కేటాయించింది. దీంతో భవన నిర్మాణ పనులు ప్రారంభించి నిధుల కొరత, నిధులు రాని కారణంగా పనులు ముందుకు సాగక ఆగిపోయాయి. అప్పటి నుంచి ఆ పనులు అక్కడికే ఆగిపోయి, నిలిచిపోయాయి. వెదురుకుప్పం ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, కోపా, డ్రస్ మేకింగ్, మెకానిక్ డీజిల్ కోర్సులు ఉన్నాయి. ఐటీఐ గురించి పట్టించుకోకపోవడం వల్ల ఇప్పటి వరకు సొంత భవన వసతి లేకుండా వెదురుకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోనే ఉంది. శిథిల భవనంలోనే తరగతుల నిర్వహణ. ఐటీఐ భవన నిర్మాణం కలేనా?



శిథిలస్థితిలో ఉన్న వెదురుకుప్పం ఐటీఐ భవనం

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

చిత్తూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ శ్రీహరిరెడ్డి కథనం మేరకు..ఆదివారం గుడిపాల మండలం చీలాపల్లి క్రాస్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న సుకన్య అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 20 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడిలో ఎస్‌ఐ పృథ్వీరాజ్, సిబ్బంది శరవణ, దామోదరం, ప్రసన్న పాల్గొన్నారు.

నారా రామ్మూర్తినాయుడికి ఘననివాళి



పాలసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి చిత్ర పటానికి ఆదివారం రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి నివాళులర్పించారు. చంద్రగిరిలోని వారి ఇంటివద్ద రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లోకనాథనాయుడు, జయచంద్రనాయుడు, రవినాయుడు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

నింద్ర, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జోరం దుకుంది. ఆదివారం మండలంలోని మేకంబాకం పంచాయితీలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఓంప్రకాష్ పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

బంగారుపాళ్యం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం త్రైతసిద్ధాంత, భగవద్గీత ప్రచారాన్ని త్రైతసిద్ధాంత ప్రబోధసేవాసమితి, హిందూ జ్ఞానవేదిక బంగారుపాళ్యం సభ్యులచే ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిరత్నం, ధనుంజయ, బాలాజి పాల్గొన్నారు.


సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ



రైతు చంద్రకళ పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

బంగారుపాళ్యం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేడుపల్లి గ్రామంలో రైతు చంద్రకళ వ్యవసాయపొలంలో సేంద్రియ విధానంలో సాగు చేసిన పంటలను స్టేట్ ట్రైనింగ్ ఆఫీసర్ మీరాబీ వ్యవసాయ సిబ్బందితో కలసి పరిశీలించారు. కషాయం తయారీపై ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందికి శిక్షణ అందించారు.

హుండీ చోరీ



యాదమరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్దానపల్లి గంగమ్మ ఆలయం హుండీని పగులగొట్టి, అందులోని నగదును దొంగలు దోచుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని మోర్దానపల్లి గ్రామశివారులో ఉన్న గంగమ్మ గుడిలో శనివారం అర్ధరాత్రి దొంగలు వచ్చారు. ప్రధాన ఆలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన హుండీని పెకిలించి సమీపంలో చెరువు వద్దకు తీసుకెళ్లి అందులో భక్తులు సమర్పించిన సుమారు రూ.30వేల నగదు దోపిడీ చేశారు. ఖాళీ హుండీ పడేసి పారిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

గోకులం షెడ్లకు రాజకీయ గ్రహణం



అయనంబాకం పంచాయతీలో చేపట్టిన గోకులం షెడ్డు నిర్మాణం

నగరి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల ఏర్పాటుకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. దీంతో పంచాయతీ కార్యదర్శులు అడకత్తెరలో పోకచెక్కలా విలవిలలాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలానికి 50 గోకులం షెడ్లను మంజూరుచేసింది. ఆవులు, మేకలు, గొర్రెలు కలిగివున్న వారు వాటి పోషణకు అవసరమైన షెడ్లను నిర్మించుకుంటే ప్రభుత్వం సబ్సిడీతో నిధులు మంజూరు చేస్తుంది. ఉపాధి హామీ పథకం నిధులతో ఈ షెడ్లను నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు లబ్ధిదారులను ఎంపిక చేసి గ్రామసభ తీర్మానం చేయాలి. సర్పంచ్, వార్డుమెంబర్లు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేసి అధికారులకు అందించాలి. ఆ తీర్మానాన్ని మండల అధికారులు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. తర్వాత షెడ్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. జియోట్యాగ్ విధానం ద్వారా ఫొటోలు తీసి పనులు చేయాల్సి వుంది. రెండు ఆవులు వున్న వారికి రూ1,15,000, నాలుగు ఆవులుంటే రూ1,85,000, ఆరు ఆవులుంటే రూ2,30,000 మంజూరు కాగా అందులో 90శాతం ఉపాధి నిధులు మిగిలిన 10శాతం లబ్ధిదారులు భరించుకోవాల్సి ఉంటుంది. 20 మేకలు గాని, గొర్రెలు వుంటే రూ.1,30,000, 50 ఉంటే రూ.2,30,000, 100 కోళ్లు వుంటే రూ.87,000, 200 కోళ్లు వుంటే రూ.1,32,000 మంజూరు చేయగా అందులో 70 శాతం ఉపాధి నిధులు, 30శాతం లబ్ధిదారులు భరించుకోవాల్సి ఉంటుంది.

ఆమోదమే అడ్డంకి

ఈ షెడ్ల నిర్మాణానికి పంచాయతీ ఆమోదం తప్పనిసరి కావటంతోనే రాజకీయ గ్రహణం పట్టుకుంది. నగరి మండల పరిధిలో 21 పంచాయతీలుండగా 18 పంచాయతీలు తీర్మానం చేశాయి. మిగిలిన ముడిపల్లి, ఎంకొత్తూరు, తడుకుపేట పంచాయతీలు తీర్మానం చేయలేదు. దీంతో పంచాయతీ కార్యదర్శులు అటు సర్పంచులకు, ఇటు అధికారులకు ఏమి చెప్పాలో తెలియక సతమతమవుతున్నారు. కలెక్టర్ మాత్రం గోకులం షెడ్లకు నిధులు ఉన్నాయని నెలాఖరులోపు పూర్తి చేయాలని పదే, పదే చెబుతున్నా తీర్మానం చేయకపోవడం గమనార్హం. ఫలితంగా వచ్చిన నిధులు వెనక్కు వెళ్లిపోయే ప్రమాదం ఉందని గోకులం షెడ్లపై ఆసక్తిగలవారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.